క్లుప్తంగా

ఓటమి భయంతోనే ఐటీ తనిఖీలు

కేతేపల్లి: ఓటమి భయంతోనే బీఆర్ఎస్, బీజేపీ నేతలు కుమ్మక్కై కాంగ్రెస్ అభ్యర్థుల ఇళ్లలో ఐటీ తనిఖీలు చేయిస్తున్నారని టీపీసీసీ మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ. యూసుఫ్‌జానీ ఆరోపించారు. శనివారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమన్న ప్రచారం సాగుతుండటంతో జీర్ణించుకోలేకనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా సోదాలు చేయిస్తున్నాయని ఆయన విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

నకిరేకల్ : నిరంకుశ పాలన సాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని అంతమొందించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజెఏసీ) స్టీరింగ్ కమిటీ మెంబర్ పన్నాల గోపాల్‌రెడ్డి కోరారు. ఆ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రూపొందించిన ప్రచార కరపత్రాలను శనివారం నకిరేకల్‌లో ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు మందా రంజిత్ రావు,నిమ్మల రాఘవులు, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఇంటింటి ప్రచారం

రామగిరి(నల్లగొండ): నీతి నిజాయితీ పరులకు ఓటు వేయాలని నల్లగొండ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. శనివారం తిప్పర్తి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గణేష్, భిక్షం, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మృతికి శ్రద్ధాంజలి

చండూర్ : మండలం పరిధిలోని బోడంగిపర్తి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు, గీత కార్మికుడు బొమ్మరగాని రామలింగయ్య (55) శుక్రవారం సాయంత్ర తాటి చెట్టు పైనుంచి మృతిచెందాడు. ఆయన మృతదేహానికి రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలకు రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కట్కూరి సత్తయ్య, వట్టికోటి శ్రీనివాస్, నాయకులు సరికొండ. ముత్యాలు, పందుల భిక్షం, వరికుప్పల సురేష్, అంబేద్కర్, రామలింగయ్య, శంకరయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నాంపల్లి : మండల కేంద్రంలోని మహేష్ బెల్ట్ దుకాణంలో 6లీటర్ల మద్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నజీర్



నియామకపత్రం అందజేస్తున్న జానారెడ్డి

మర్రిగూడ: మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ నజీర్‌ను నియమిస్తూ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి శనివారం హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం ఎ.సలీం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ సరిపంగి శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి

మర్రిగూడ : మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వీసం సుందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయన వెంట శ్రీను, యాదయ్య, రాములు తదితరులు ఉన్నారు.

బీఎల్ఆర్‌ను కలిసిన రాంరెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంపూర్ణ మద్దతు తెలపడంతో శనివారం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాంరెడ్డి, మిర్యాలగూడ కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్), కాంగ్రెస్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఎన్నికల్లో బీఎల్ఆర్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ రఘువీర్‌రెడ్డి, ఇంజం నర్సిరెడ్డి, పీసీసీ సభ్యులు కృష్ణయ్య, సీనియర్ నాయకులు పగిడి రామలింగయ్య, నాయకులు శ్రీనివాస్, సైదులు, ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, జానీపాష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లిలో గ్యార్మీ ఉత్సవాల్లో భాగంగా ముస్లింలు శనివారం గంధం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరలు వారి ఆచారాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొని ఒకరి ఒకరికి అభినందనలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండెబోయిన నగేష్ యాదవ్, ఖాదర్, షేక్ లేఖత్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మాణం జరిగేనా!

- ప్రమాదకరంగా పద్మానగర్ జంక్షన్
- పూర్తి కాని సర్వీస్ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ప్రమాదకరంగా ఉన్న పద్మానగర్ జంక్షన్



చీమలగడ్డ - ఇనుపాముల వరకు పూర్తి కాని సర్వీస్ రోడ్డు

నకిరేకల్ : హైవేపై ప్రమాదకరంగా ఉన్న జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన నిర్మాణాలు చేపడతామని, సర్వీస్ రోడ్లు నిర్మిస్తామని ఎన్నికల సమయంలో వివిధ పార్టీ అభ్యర్థులు హామీలు ఇస్తున్నారే తప్ప అమలుచేయడం లేదు. గడిచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు హామీలు ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఈసారి పోటీలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులైనా తమ ఎన్నికల హామీలో చేర్చి గెలిచిన తరువాత అండర్ పాస్ వంతెన నిర్మించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు..

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని విస్తరించినప్పటికీ వాహనదారులు, ప్రజలు ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ రహదారి గుండా నిత్యం 50 వేలపైనే వాహనాలు వెళుతుంటాయి. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల మీదుగా 65 కిమీ హైవే విస్తరించింది. అయితే నకిరేకల్‌లోని ప్రధాన జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెనలు నిర్మించడాన్ని హైవే అధికారులు మరిచారు. ఏళ్ల గడుస్తున్నా జీఎంఆర్, హైవే అధికారులు సర్వీస్ రహదారులను పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కలగానే మిగిలింది. చీమలగడ్డ ఫ్లై ఓవర్ అండర్ పాస్ నుంచి ఇనుపాముల జంక్షన్ వరకు కూడా సర్వీస్ రోడ్లు పూర్తి కాలేదు. నకిరేకల్ పట్టణం నుంచి హైదరాబాద్, నల్లగొండ వైపు వెళ్లాలంటే జంక్షన్ దాటి వెళ్లాలి. జంక్షన్ దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు అతి వేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ విద్యుత్ లైట్లు కూడా లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నకిరేకల్‌లోని పద్మానగర్ వద్ద గత రెండేళ్లలో నలుగురు ప్రాణాలు కోల్పోగా 30మందికి పైగా గాయాలపాలయ్యారు. ప్రత్యేకించి ఈ జంక్షన్ పక్కనే పద్మానగర్ కాలనీ ఉంది. ఈ కాలనీవాసులు రాత్రి వేళలో జాతీయ రహదారి కూడలి దాటి నకిరేకల్ పట్టణానికి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు.అండర్ పాస్ వంతెన నిర్మించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అండర్‌పాస్ నిర్మించాలి



పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్ పాస్ నిర్మించాలి. ఈ జంక్షన్ వద్ద లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– చిట్టిప్రోలు యాదగిరి, పద్మానగర్, నకిరేకల్

అధికారంలోకి వస్తే పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



శాలిగౌరారం : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, నల్లగొండ రూరల్ : : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ఆయన సమక్షంలో కనగల్ మండలం దర్వేశిపురం, నల్లగొండ మండలం అన్నారెడ్డిగూడేనికి చెందిన పలువురు, 17వ వార్డుకు చెందిన 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మందడి శ్రీనివాసరెడ్డి, బోదనం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కర్ణాటక మాజీ మంత్రి

కర్ణాటక మాజీ మంత్రి, నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్ శనివారం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎన్నికలపై చర్చించుకున్నారు.

కోమటిరెడ్డిని కలిసిన మందుల సామేల్

తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ శనివారం ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి తుంగతుర్తి నుంచి వచ్చిన కార్యకర్తలకు కాంగ్రెస్ కండువా కప్పి మాట్లాడారు. త్వరలో తాను ప్రచారానికి వస్తానని కార్యకర్తలంతా పని చేయాలని కోరారు.



పార్టీలో చేరిన వారితో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

శాలిగౌరారం: మండలంలోని తక్కెళ్లపహాడ్, వల్లాల, ఆకారం గ్రామాలకు చెందిన సుమారు 50 మందికి పైగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి నేతృత్వంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మందుల సామేల్ సమక్షంలో శనివారం నల్లగొండలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో వల్లాల సర్పంచ్ షేక్ ఇంతియాజ్, ఉపసర్పంచ్ గుండ్లపల్లి సైదులు, మాజీ సర్పంచ్‌లు బొడిగే వెంకటేశ్వర్లు, భూపతి మంగమ్మవెంకన్న, కొంపల్లి జానయ్య, పెరుమాండ్ల నరేశ్, జంగిలి మారయ్య, ఆకారం మాజీ ఎంపీటీసీ వలిశెట్టి సైదులు, అయితగోని వెంకన్న, సైదులు, జవాజి భూషణం, మాధగోని గోపి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన లారీ డ్రైవర్స్, ఓనర్స్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: పట్టణంలోని నాలుగోవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ జమాండ్ల జయమ్మ శ్రీనువాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లారీ డ్రైవర్స్, ఓనర్స్ ప్రతినిధులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ లారీ ఓనర్స్, డ్రైవర్స్ సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. పార్టీలో చేరిన వారిలో జమాండ్ల నర్సిరెడ్డి, కొండే నరేష్, బానావత్ సురేష్, కొండె శ్రీకాంత్, కొండే సాయిలతో పాటు మరికొందరు ఉన్నారు.అంతేకాకుండా పలువురు కాశీ బ్రహ్మణ కులస్తులు తండు కిరణ్, మన్నెం అశోక్, ఎర్రా కిరణ్, శ్యామల గణేష్‌తో పాటు మరికొందరు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఏఎంజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, కౌన్సిలర్ శేపూరి రవీందర్, బెల్లి సత్తయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పోన్నం లక్ష్మయ్యగౌడ్, గుండెబోయిన సైదులు, వనమా వెంకటేశ్వర్లు, గొదుమగడ్డ జలంధర్‌రెడ్డి, పాటి మాదవరెడ్డి, సిలివేరు శేఖర్ పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

నకిరేకల్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరో సారి ఆశీర్వదించాలని ఆ పార్టీ నకిరేకల్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కోరారు. నకిరేకల్ మండలం నెల్లిబండ, గొల్లగూడెం, చందంపల్లి గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, రాష్ట్ర నాయకులు చింతల సోమన్న, నాయకులు మాదగోని అరుణ్‌కుమార్, శ్రీనివాస్, మహేష్,నారగోని సైదులు, లింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు

చిట్యాల: పట్టణంలోని 3, 12వ మున్సిపల్ వార్డులకు చెందిన పలువురు నాయకులు శనివారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రెముడాల ఆనంద్, వల్లపు హరికృష్ణ, ఎంపాల చిన్నగట్టయ్య, బక్కతట్ల శ్రీనివాస్, మెండే యాదయ్యతో పాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ రెముడాల లింగస్వామి, నాయకులు సాగర్ల గోవర్ధన్, ఏళ్ల మల్లేశం, రెముడాల యాదయ్య, జడల ఎల్లయ్య, జడల మహేష్ పాల్గొన్నారు.

గడప గడపకూ బీజేపీ ప్రచారం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ నియోజకవర్గ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ శనివారం తిప్పర్తి మండలం ఎర్రగడ్డలగూడెం, సర్వారం గ్రామాల్లో గడప గడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, గంగాధర్, బ్రహ్మాచారి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీఆర్ఎస్‌దే అధికారం

- రాజ్య సభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

నకిరేకల్ : తెలంగాణలో కాంగ్రెస్ వారు ఎన్ని ఎత్తుగడలు వేసినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నకిరేకల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా కర్నాటక కాంగ్రెస్‌సీఎం సిద్దిరామయ్య వచ్చి ఆరు గ్యారంటీ స్కీంలు గురించి మాట్లాడుతున్నారని వారి మాటాలను తెలంగాణ ప్రజలు నమ్మరని చెప్పారు. బీసీల గురించి కాంగ్రెస్ వారు మాట్లాడుతున్నారని. బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ బీసీలకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ సోమ యాదగిరి, పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, నాయకులు మురారిశెట్టి కృష్ణమూర్తి,పెండెం సదానందం , రాచకోండ శ్రవణ్, గుర్రం గణేష్, దైద పరమేషం,రాచకొండ వెంకన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బడుగుల లింగయ్యయాదవ్

నల్లగొండను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దా



నల్లగొండలో ప్రచారం చేస్తున్న భూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దినట్లు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 47వార్డులో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నల్లగొండను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సుంకరి మల్లేష్ గౌడ్, మాల శరణ్య రెడ్డి, బోనగిరి దేవేందర్, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, మారగొని నవీన్ గౌడ్, పున్న గణేష్, నాయకులు సింగం రామ్మోహన్, సింగం లక్ష్మి, గణేష్, చక్రం వేణుగోపాల్ రావు, డాక్టర్ చెరుకు సుహాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసా.. మరోసారి ఆదరించాలి

కనగల్: నల్లగొండ నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనను మరోసారి ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చర్లగౌరారం గ్రామానికి చెందిన 100మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాష, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, సర్పంచ్ చింతల యాదగిరి, ఎంపీటీసీ పాలకూరి సైదులు, మాజీ ఎంపీటీసీ బోయపల్లి జానయ్యగౌడ్, చెరుకుపల్లి రవి, సిరిషాల కిషన్, నక్క తిరుపతి, నకిరేకంటి వెంకన్న, రాయల గిరి, దోమలపల్లి యాదగిరి, ఏటెల్లి శంకర్ తదితరులున్నారు.

వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ: మండలంలోని మేటిచందాపురం పరిధిలోగల ఇందుర్తి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు చౌటుప్పల్‌లో నామాపురం ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్‌యాదవ్, అశోక్‌గౌడ్, ఏరుకొండ అబ్బయ్య, ఏరుకొండ లింగస్వామి, యాదగిరి, గణేష్, భిక్షం, లపంగి సాయికుమార్, సిరిపంగి శ్రీకాంత్, లపంగి శివ, ఊరిపక్క నరసింహ, లపంగి లిఖిత్‌కుమార్, ఊరిపక్క నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురికావద్దు

దేవరకొండ : ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని ఆలిండియా సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు మద్దిమడుగు భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్‌లు కోరారు. శనివారం దేవరకొండలో ఆ సంస్థ నియోజకవర్గ అధ్యక్షుడు చిట్యాల గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

నేత్రదానంతో మరొకరికి కంటి చూపు

మిర్యాలగూడ : నేత్రదానంతో మరొకరికి కంటి చూపు వస్తుందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కేబినేడ్ సెక్రటరీ మాశెట్టి శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్‌లు అన్నారు. శనివారం పట్టణంలోని ఐ బ్యాంక ఆఫ్ ఇండియాకు అనుబంధంగా ఏర్పాటు చేసిన డైమండ్ నేత్ర బ్యాంక్ సమాచార కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. మిర్యాలగూడలో నేత్రదానం చేసే వారికి సౌకర్యార్థంగా ఐ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా నేత్ర సమాచార కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మిర్యాలగూడలో మరణాంతరం సుమారు 45మంది నుంచి నేత్రాలను సేకరించామన్నారు. అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు రాజీవ్‌కుమార్, పవన్‌కుమార్‌లు మాట్లాడుతూ దేశంలో 13మిలియన్ల మంది అంధత్వం బాధపడుతున్నారని తెలిపారు. గ కార్యక్రమంలో కోల సైదులు, మిట్టపల్లి విజయ్, భాస్కర్, బిఎం. నాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిక



కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని 42వ వార్డు పెద్ద బండ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు 300 మంది శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో పార్టీలు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ దత్తత తీసుకొని రూ.1350 కోట్లతో నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో శివశంకర్, లింగంపల్లి వెంకటేష్, బిక్షం, సముద్రాల సాయికుమార్, గోగుల స్వాతి, ఎం కవిత, శ్రావణి, నవ్య తదితర ముఖ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

రామగిరి(నల్లగొండ): మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ ఆధ్వర్యంలో శనివారం తిప్పర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, కోన జానయ్య, నరసింహగౌడ్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



మర్రిగూడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మర్రిగూడ : మండలంలోని ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాంపల్లి సీఐ కె.నవీన్‌కుమార్ అన్నారు. శనివారం హిమాచల్‌ప్రదేశ్ ఐటీబీపీ ఫోర్స్ పోలీసులతో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన లెంకలపల్లి, శివన్నగూడ, కుదభాక్షపల్లి, మర్రిగూడ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రంగారెడ్డి, సిబ్బంది వాహిద్, గణేష్, సైదులు, రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న శ్రీనివాస్ గౌడ్

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని 14వ వార్డు మర్రిగూడకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు శనివారం బీజేపీ కార్యాలయంలో పార్టీ అభ్యర్థి మాదగోని శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీజేపిని గెలిపించేందుకు యువత పెద్ద ఎత్తున పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, గోలి మధుసూదన్ రెడ్డి, బండారు ప్రసాద్, కంకణాల నాగిరెడ్డి, జగ్జీవన్, మధు, రాఖీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అందని 'ఆసరా'

- పింఛన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- ఓపెన్ కాని పెన్షన్ సైట్
- ఆసరా అందించి ఆదుకోవాలని కోరుతున్న దరఖాస్తుదారులు



మర్రిగూడలో సదరం సమయం పెంచాలని ఆందోళన చేస్తున్న దివ్యాంగులు (ఫైల్)

మర్రిగూడ: ఆసరా పింఛన్ల కోసం అర్హత కలిగిన వారు ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్నా ప్రభుత్వం స్పదించడం లేదని వాపోతున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా 20 గ్రామపంచాయతీలు, 25 ఆవాస ప్రాంతాల్లో కెల్లా 5,585 మంది ప్రస్తుతం ఆసరా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు. వీరిలో వృద్ధాప్య, వితంతువులు, కల్లుగీత, చేనేత లబ్ధిదారులకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 ప్రభుత్వం చెల్లిస్తోంది. వీరంతా నూతన పింఛన్ల కోసం స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర అధికారుల ఆమోదం పొందిన అనంతరం పెన్షన్ పొందాల్సి ఉంటుంది.

గ్రామాల వారీగా...

అజ్జిలాపురం 4, అంతంపేట 34, దామెరబీమనపల్లి 18, కమ్మగూడ 18, కుదభాక్షపల్లి 32, కొండూరు 19, కొట్టాల 8, లెంకలపల్లి 33, మర్రిగూడ 42, మేటిచందాపురం 13, నామాపురం 21, రాజాపేట తండా 5, రాంరెడ్డిపల్లి 14, సరంపేట 7, శివన్నగూడ 39, తమ్మడపల్లి 5, తిరగండ్లపల్లి 12, వట్టిపల్లి 23, వెంకేపల్లి 6, యరగండ్లపల్లి 27 ఇలా మొత్తం గత సంవత్సరం ఆగస్టు నుంచి నేటి వరకు 353 మంది ఆసరా పింఛన్ల కోసం అర్హత గల వారు దరఖాస్తు చేసుకున్నారు. కానీ నేటికి ఆసరా వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు.

పెన్షన్ పొందుతున్న వారు మృతిచెందితే..

ఆసరా పెన్షన్ పొందుతున్న కుటుంబంలోని భార్య, భర్తల్లో ఎవరైనా అకాల మరణం పొందితే ఆ కుటుంబంలోని వారికి మరణించిన వారి ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెల నుంచి ఆసరా పింఛన్ పొందే అవకాశం ఉంటుంది. కాని వృద్ధాప్య పింఛన్ పొంది ఏదైనా కారణం చేత అంగవైకల్యం ఏర్పడితే అంగవైకల్య పింఛన్ పొందవచ్చు. కానీ అట్టి సదరం సర్టిఫికెట్ గడువు ముగియడంతో తిరిగి వృద్ధాప్య పింఛన్ పొందాలంటే మరల అవకాశం కల్పించకపోవడంతో అలాంటి లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిశీలించి అలాంటి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఆసరా పింఛన్ అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సదరం సమయం పెంచాలని..

దివ్యాంగులు సదరం క్యాంపుకు వెళ్లేందుకు ప్రతి నెల నిర్వహించే సదరం సమయం పెంచాలని కోరుతూ గత రెండు నెలల క్రితం మర్రిగూడ మండల కేంద్రంలో ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కంచుకట్ల సుభాష్ ఆధ్వర్యంలో దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి గంటల తరబడి క్యూలో నిల్చొన్నా తక్కువ సమయంలో స్లాట్ బుకింగ్ సమయం ముగిసిందని మీసేవ వారు చెప్తుండడం కొసమెరుపు.

మూడేళ్ల నుంచి పింఛన్ రావడం లేదు



మూడేండ్ల నుంచి అనేక సార్లు ఆసరా పింఛన్ కోసం ఎంపీడీవో ఆఫీసు చుట్టూ తిరుగుతూనే ఉన్నా. కాని పింఛను ఇవ్వడం లేదు. ముందుగా వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ప్రమాదానికి గురి కావడంతో వికలాంగుల పింఛన్ ఇచ్చారు. ఆ తరువాత సదరం క్యాంపునకు వెళ్తే పర్సంటేజీ తగ్గింది. తిరిగి వృద్ధాప్య పింఛన్ ఇవ్వమంటే ఇవ్వడం లేదు. అధికారులు నాకు పింఛను ఇప్పించి ఆదుకోవాలి.

– పోలె రాములు, వట్టిపల్లి

బతుకు భారమైంది



గత ఐదేండ్ల నుంచి పింఛన్ కోసం తిరుగుతూనే ఉన్నాను. కానీ ఇప్పటివరకు రాలేదు. పూట గడవడానికి, మందులు తెచ్చుకోవడానికి నా భార్య పనిచేస్తేనే గడుస్తుంది. ఓటరు కార్డులో వయసు తక్కువ ఉందని పింఛను ఇవ్వలేదు. 57 ఏండ్లకే పింఛను వచ్చినప్పుడు 65 ఏండ్లు పైగా ఉన్న నాకు ఎందుకు రావడం లేదు. నా దీనస్థితి చూసి అధికారులు పింఛను ఇప్పించాలని కోరుతున్నా.

– పొనగంటి సత్తయ్య, రాజాపేటతండా

ఎన్నికల తరువాత సైట్ ఓపెన్ కావొచ్చు



ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల అనంతరం ఆసరా పెన్షన్ సైట్ ఓపెన్ కావొచ్చు. ప్రభుత్వ ఉన్నత అధికారుల ఉత్తర్వుల మేరకు దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హత కలిగిన వారి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి ఆసరా పింఛన్ అందించే విధంగా చొరవ చూపుతాము.

– జి.వెంకటేశ్వర్‌రావు,ఎంపీడీఓ